మూ॥ ధిన్వన్తు కోమలపదాః శివవల్లభాయాః
చేతో వన న్తతిలకాః కవికుఞ్జరస్య
ఆనన్దయన్తు చ పదాశ్రిత సాధుసఙ్ఘం
కష్టంవిధూయ సకలంచ విధాయచేష్టమ్. 25

కవికుంజరుడగు గణపతి రచించిన లలితపదములగు వసంత తిలకములు శివవల్లభయగు ఉమ హృదయమును రంజింపఁజేయునుగాత! మఱియు కష్టమును తొలఁగించి యిష్టమును కలిగించి త్వదీయపదాశ్రితమగు సాధుసంఘమును ఆనందింపఁజేయునుగాత!

ప్రభ:-కవికుంజరుఁడు = కవిశ్రేష్ఠుఁడు, మదీయములగు వసంత తిలకాస్తుతులు - దేవీ ప్రీణనమును, సాధుజనానందమును సంఘటించుఁగావు తమని తాత్పర్యము.

ఇది - సవ్యాఖ్యమగు సప్తమ స్తబకము.
ఓమ్ తత్, సత్.

* * * *



ఓం నమోభగవతే శ్రీరమణాయ

# ఉమాసహస్రము

## (ద్వితీయ శతకమున - చతుర్థ స్తబకము)

## అష్టమ స్తబకము

మూ॥ తమసా మభితోహన్తా చణ్డికాహాస వాసరః
సతాం హృదయరాజీవ వికాసాయ ప్రకల్పతామ్.॥ 1

సర్వమునుండియు (సాకల్యముగా) తమములను తొలఁగించునదియగు చండికాహాస - వాసరము - సజ్జనహృదయ - రాజీవమును వికసింపఁ జేయునుగాత!

ప్రభ:- మూలమునందలి "అభితః" అను పదమునకు "సాకల్యముగ" అనిగాని సర్వమునుండియు, అనిగాని అర్థమును జెప్పనగును.

హాస - వాసరము అనఁగా "చిరునవ్వు" అను "హృదయ - రాజీవము" అనఁగా హృదయమను పద్మము, పగలు - పద్మమును, వికసింపఁజేయును. హాసము హృదయము నున్మీలింపజేయును. తమమనగా అజ్ఞానము - లేక అంధకారము. సర్వమునుండియు తమములను తొలగించుట ఉభయగతమగు నర్థశ్లేషము.

ఇందు విషయియగు వాసరము యొక్క రూపము చేత విషయమగు హాసమునకు రంజనము కలిగినది. కావున నిదిరూపకాలంకారమగుచున్నది.

వాసర సాపేక్షమగు రాజీవ వికాసమును, హాససాపేక్షమగు హృదయోన్మీలనము అను వస్తువు - మీఁదిరూపకము చేత అనుప్రాణితము -

అనుప్రాణితమవుగు నా వస్తువు చేత - (సజ్జనహృదయవికాసవు) దేవ్యనుగ్రహబలమువలననే సిద్ధించుననునర్థము ద్యోతితము.

ఇట్లు స్తబక ప్రారంభమున కడచినస్తబక ప్రారంభములయందు వలెనే హాసస్తుతి గర్భితమగు నాశీస్సు ప్రయుక్తము.

మూ॥ యానిద్రా సర్వభూతానాం యోగనిద్రారమాపతేః
ఈడ్యతాం సా మహాకాలీ మహాకాలసఖీ సఖే ! 2

సఖా! (మిత్రమా) ప్రాణులకందఱకును నిద్రయు, రమాపతియగు విష్ణువునకు యోగనిద్రయు, మహాకాలసఖియు, దేవియునగు మహాకాలిని స్తుతింపుము.

**ప్రభ:**- ''సఖా'' అనునది దేవతారాధకుఁడును, ఆస్తికుఁడును అగు ప్రియ స్నేహితునిగూర్చిన సంబోధనము. సర్వ విస్మరణరూపమగు లయావస్థ యిందు సర్వభూత నిద్రగాఁ జెప్పఁబడినది. మహా కాలుఁడన నీశ్వరుఁడు, అతనికి ప్రియురాలగు జగన్మాత మహాకాలసఖి. ఈ స్తబకమున సప్తశతీచరితత్రయ ప్రసిద్ధ దేవతామూర్తులలో భగవతియగు మహాశక్తి, మధుకైటభాది సంహార ప్రస్తావనద్వారమునస్తుతింపబడుచున్నది. కడచిన స్తబకమున యోగనిద్ర వ్యాఖ్యానింపఁబడినది.

మూ॥ విరిఞ్చినాస్తుతే! మాతః! కాలి! త్వంచేన్న ముఞ్చసి
మధుకైటభసంహారం కరోతుకథ మచ్యుతః॥ 3

మాతా ! విరించిస్తుతవగు నీవచ్యుతుని విడువని యెడల నచ్యుతుఁడగు నా విష్ణువు మధు – కైటభసంహారము నెట్లొనర్చును?

**ప్రభ:**- విరించియన బ్రహ్మ. విష్ణునినేత్రములయందువసించియున్న యోగ నిద్రయగు ఏ మహాకాళిని బ్రహ్మదేవుడు సంస్తుతించెనో ఆ మహాకాళిచే



విడువఁబడుటలవలననే భగవానుఁడగు విష్ణుఁడు మధుకైటభులను సంహరించెనని తాత్పర్యము.

**అవ:**- ఇప్పుడు సప్తశతీ ద్వితీయచరిత దేవత యొక్క మహాత్మ్యమును స్తుతింపఁగోరినకవి, ఆ దేవీమూర్తి చేతఁజంపఁబడిన మహిషాసురుని ప్రచండసాహసమును, ఆధిపత్యమును పండ్రెండు శ్లోకముల చేత నభివర్ణించుచున్నాఁడు.

మూ॥ వాసవ, కాశనీకాశయశో లఙ్కృత దిఙ్ముఖః
మహోగ్రవిక్రమాద్ యస్మాదాసీదాజౌ పరాఙ్ముఖః॥ 4

మహోగ్రపరాక్రముఁడగు ( ఏ మహిషుని వలన కాశపుష్ప సదృశమగు యశస్సుచేత నలంకరింపబడిన దిఙ్ముఖములు గల వాసవుఁడు ( గూడ) యుద్ధమున పరాఙ్ముఖుఁడయ్యెను.

**ప్రభ:**- మహోగ్ర విక్రముఁడన, నధికమును ప్రచండమునునగు పరాక్రమము గలవాఁడని యర్థము. వాసవుఁడు పూర్వదిక్పాలకుఁడు. మహాయశస్కుఁడగు దేవరాజు కూడ పరాజయము నొందెనని తాత్పర్యము, 'యస్మాత్' ఎవని వలన అని మూల శ్లోకమునందుఁగల యచ్ఛబ్దమునకు 'మహిషం తం మహావీర్యమ్' (మహావీర్యుడగు ఆ మహిషుని) అని పదునైదవ శ్లోకమునందలి తచ్ఛబ్దముతో సంబంధము చెప్పఁబడినది. అయినను ఆంధ్రభాషా సంప్రదాయము ననుసరించి, యీ యాంధ్రీ కృతియందు యత్పదార్థము విడువఁబడియెనని గ్రహించునది.

మూ॥ యత్ ప్రతాపేన సంతప్తో మన్యేబాడబరూపభృత్
భగవాననలోஉద్యాపి సిన్ధువాసం సముఞ్ఛతి॥ 5

మహిషుని ప్రతాపమున సంతప్తుఁడగు భగవంతుఁడనలుడు- బాడబరూపమును భరించి యిప్పటికిని గూడ సముద్రనివాసమును విడువకున్నాఁడని తలంచెదను.

**ప్రభ:-** దక్షిణ – పూర్వ ( ఆగ్నేయ) దిక్పాలకుఁడగు నగ్ని దేవుఁడే యిందుఁ దెలుపఁబడిన అనలుఁడు. బాడబాగ్నియన, ఔర్వమనునగ్ని. బడబయందుదయించిన బాడబాగ్నికి సముద్రవాసము పురాణప్రసిద్ధము. మహిషాసురుని వలనఁ గలిగిన సంతాపము నుపశమింపఁజేసికొనుటకు, అగ్ని సముద్రమునందు నివసించినట్లు మీఁది శ్లోకమున సంభావింపఁబడినది. కాని యతఁడు సముద్రమున నివసించుటకది హేతువు కాదు. హేతువుకాని మహిషాసురజన్య సంతాపోపశమన మిచట హేతువుగా నూహింపఁబడుట వలన నిది హేతూత్ప్రేక్షాలంకార మగును. అగ్నికి సముద్రవాసము పురాణ ప్రసిద్ధమగుట వలన ఆహేతూత్రేక్ష సిద్ధవిషయ మగుచున్నది.

మూ॥ కుర్వాణో భూతకదనం యస్మిన్ విస్మితచేతసః
ఏష ఏవాన్తకో నాऽహమిత్యాసీదన్త కస్యధీః ॥ 6

మహిషుడు ప్రాణినాశము నొనర్చుచుండునపుడు విస్మయము నొందిన మనస్సు గల అంతకునకు ( యమునకు) 'వీఁడే అంతకుఁడు ( కాని) నేను కాను'' అను బుద్ధి కలిగెను.

**ప్రభ:-** అంతకుఁడనఁగా నాశము నొనర్చువాఁడు. ఇతఁడే దక్షిణదిక్పాలకుఁడగు యముఁడు. మహిషుఁడొనర్చుచున్న ప్రాణివధమును వీక్షించుట వలన తనకుఁగల అంతకత్వమును మరచిన యంతకునకుఁ వాఁడే యంతకుఁడను భ్రాంతి కలిగెను అని చెప్పుట వలన నిది పర్యస్తాపహ్నవ – భ్రాంత్యలంకార సంకరమగుచున్నది.

మూ॥ రణే యేనాతిరస్కృత్య త్యక్తో రాక్షస ఇత్యతః
చిరాయహరిదీశేషు కోణేశః ప్రాప్తవాన్ యశః ॥ 7

రాక్షసుఁడగు మహిషుఁడు యుద్ధమునందు దక్షిణ పశ్చిమముల నడుమనున్న కోణమున కధిపతియగు నిఋతిని రాక్షసుఁడను హేతువు వలన అవమానింపక విడువఁగా నతఁడు దిక్పాలకులయందు కొంత కీర్తినొందెను.



**ప్రభ:-** రాక్షసుఁడను హేతువు వలన = జాతి పక్ష పాతము వలన.

ఇందు రాక్షసుఁడను సజాతీయ పక్షపాతము వలన మహిషునిచేత నిఋతి తిరస్కృతుఁడు కాఁడయ్యెనని సంభావింపఁబడినది. కాని ఉత్ప్రేక్షా వాచకమగు ఇవాదిశబ్దము ప్రయోగింపఁబడలేదు. కావున నిది గమ్యమగు ఉత్ప్రేక్షాలంకారమగుచున్నది.

మూ॥ యన్నియన్తు మశక్తస్య కుర్వాణ మసతీః క్రియాః
నియన్తు రసతామాసీత్ పాశినో మలినం యశః ॥ 8

దుష్కార్యముల నాచరించుచున్న మహిషుని నియమించుట కశక్తుఁడగుట వలన పాపనియంతయగు వరుణుని కీర్తి మాలిన్యము నొందెను.

**ప్రభ:-** పాశయుక్తుఁడగు వరుణుడు – పశ్చిమ దిక్పాలకుఁడు. అతఁడు సర్వ పాపదమనుఁడని ప్రసిద్ధుడైయున్నాఁడు. మహిషుని నియమించుట యందశక్తుడగుట వలన నతని కీర్తి కూడ మందమయ్యెనని భావము.

ఇందు '' మహిషుని శిక్షించుటకు సామర్థ్యము లేకుండుట'' అను హేతువు కవి కల్పితము. (సంభావితము) ఆ హేతువు చేత వరుణకీర్తికి మాలిన్యము సిద్ధించెనను వస్తువు చేత ఉత్ప్రేక్ష గమ్యమగుచున్నది. కావుననిది కవి ప్రౌఢోక్తి సిద్ధమగు వస్తువు చేత అలంకారము ధ్వనింపఁజేయఁబడుటకు లక్ష్యమగుచున్నది.

మూ॥ బాహువీర్య పరాభూతో యస్యప్రాయేణమారుతః
బభూవ క్షణదాన్తేషు రతాన్త పరిచారకః ॥ 9

మహిషభుజబల పరాజితుఁడగు వాయువు క్షణదాంత ( నిశాంత) సమయములందు ప్రాయశః రతాంతపరిచారకుఁడగుచుండెను.

**ప్రభ:-** వాయుదేవుడు పశ్చిమోత్తర (వాయవ్య) దిక్పాలకుఁడు, క్షణదాంతములందు – రాత్రి ముగియు కాలములందు, రతాంతపరిచారకుఁడు = సురతశ్రమమును తొలగించు మందసంచారము గలవాఁడు.

మహిషపరాభూతుఁడగు వాయువు వానికి దాసుఁడై మెల్లగా వీవఁదొడఁగె ననుటవలన నిదియు గమ్యోత్ప్రేక్షయే యగును.

మూ॥ నిధీస్యేనజితోహిత్వా రాజరాజః పలాయితః।
స్పష్టంబభాణ మాధుర్యం ప్రాణానా మఖిలాదపి ॥ 10

మహిషహతకునిచే జయింపబడిన రాజరాజు (మహాపద్మాదులగు) నిధులను వదలుకొని పలాయితుఁడై; అన్నింటికంటెనుగూడ ప్రాణములకుఁగల మాధుర్యమును (తీపిని) స్పష్టముగా వచియించెను.

**ప్రభ:-** రాజరాజనగా, కుబేరుఁడు ఉత్తరదిక్పాలకుఁడు, అల్పమో అధికమోయగు కష్టము కలిగినపుడెల్ల ఎట్లో ప్రాణములను రక్షించుకొనుటకు ప్రయత్నించు మనుష్యుని అధైర్యమును దెలుపుటకు 'వానికి ప్రాణములే తీపి' అను లోకోక్తికలదు గదా!

ఆలోకోక్తిననుసరించి మీఁదిశ్లోకమున 'ప్రాణానాంమాధుర్యమ్' (ప్రాణములకు గల మాధుర్యమును) అని ప్రయోగింపఁబడినది. సామాన్య జనునకు వలె మహిషుని యెదుట ఉత్తర దిక్పాలకుఁడగు రాజరాజునకుఁగూడ నవనిధులకంటెను గూడ, మానముకంటెను గూడ ప్రాణములే ప్రియతరములయ్యెనను నంశము ద్యోతితము.

మూ॥ యస్మిన్నుత్తరపూర్వస్యా దిశ ఏకాదశాధిపాః
కుణ్ఠాబభూవు రాత్మీయకణ్ఠోపమితకీర్తయః ॥ 11



ఉత్తరపూర్వ దిక్పాలకులగు ఏకాదశరుద్రులు వానియెదుట కుంఠులయి (వ్యర్థులై) తమతమ కంఠములతో పోల్పఁదగిన కీర్తిగలవారయిరి.

**ప్రభ:-** ''ఉత్తరస్యాః పూర్వాస్యాశ్చ యదన్తరాలం సా ఉత్తరపూర్వ'' అనువృత్పత్తి చేత ఉత్తర పూర్వ దిక్కనగా, ఉత్తర పూర్వ దిక్కుల నడుమనున్న ఈశాన్య దిక్కగుచున్నది. తద్దిక్పాలకులు ఏకాదశ సంఖ్యాకులగు రుద్రులు. రుద్రుఁడు నీలకంఠుఁడుగా ప్రసిద్ధుఁడైయున్నాఁడు. ఏకాదశరుద్రుల యశస్సు తెల్లఁదనమును విడిచి నీలిమనాశ్రయించి, ప్రకాశరహితమై తమోనిగ్న మయ్యెనని భావము.

మూ॥ నిజశుద్ధాన్త కాన్తానా మాన నైరేవ నిర్జితమ్
లలజ్జేయః పునర్జిత్వా శూరమానీ సుధాకరమ్ ॥ 12

శూరమానియగు మహిషుఁడు నిజాంతః పురకాంతల ముఖముల చేతనే జయింపఁబడిన సుధాకరుని (చంద్రుని) తిరుగజయించి లజ్జించెను.

**ప్రభ:-** తననే శూరునిగాఁ దలచు వ్యక్తి 'శూరమాని' అని చెప్పఁబడును, నిజసుందరీ ముఖములచేత ఇంతకుముందే జయింపఁబడిన దౌర్భాగ్యుని మరల జయించుట శూరమానికి మిగుల లజ్జావహమని భావము.

మూ॥ బాలస్యేవ క్రీడనకైః ప్రవీరైర్యస్యఖేలతః
లీలాకన్దుక ధీరాసీద్దేవే ధీధితి మాలిని ॥ 13

క్రీడా వస్తువులతో నాడుకొను బాలునికి వలె ప్రకృష్టులగు వీరులతో నాడుకొనుచున్న మహిషునకు ధీధితిమాలియగు దేవుడు సూర్యుని యందు క్రీడాకందుకమను బుద్ధికలిగెను.

ప్రభ:- క్రీడా వస్తువన - ఆటవస్తువు. (బంతి మొదలగునది) బాలునకు బంతి మొదలగు ఆడుకొనువస్తువునందు, అది, తనది, వశపడినది, అడఁదగినది. అను తలఁపు కలుగునట్లు ఆటవస్తువుల తోడనువలె మహావీరులతో నాడుచున్న మహిషునకు సూర్యుని యెడల నది తనదియు, వశపడినదియునగు ఆటబంతి యనుతలఁపు కలిగెనని తాత్పర్యము. వాని పరాక్రమ- దర్పములు అట్టివని భావము.

మూ॥ క్రియామాచరశుద్ధాన్త భ్రూవిలాస నివారణమ్।
విష్ణోః సుదర్శనంచక్రం యస్యానాపశ్యదన్తరమ్ ॥ 14

రాత్రించరులగు రాక్షసుల యంతఃపురమునందలి భ్రూవిలాసములను నివారించునదియగు విష్ణు సుదర్శనము కూడ మహిషునంతరమును జూడలేకుండెను.

ప్రభ:-మహాప్రభావము, రక్షఃకులఘ్నము అగు విష్ణు చక్రముగూడ వానిని వధించుట కవకాశము నొందలేకపోయెనని తాత్పర్యము.

మూ॥ మహిషం తం మహావీర్యం యాసర్వసుర దేహజా
అవధీద్దానవంతస్యై చణ్డికాయై నమోనమః ॥ 15

మహాపరాక్రముఁడగు దానవుఁడగు ఆ మహిషుని సర్వసురదేహ సంభూతయగు ఏ దేవత వధించెనో, ఆ దేవతయగు చండికకు నమస్కారము. నమస్కారము.

ప్రభ:- దితివంశ సంభూతుఁడు దైత్యుఁడనియు, దనువంశసంభూతుఁడు దానవుఁడనియు చెప్పఁబడుదురు. 'నమోనమః' అనుచో నున్నద్విరుక్తి - బహు నమస్కారార్థము.



హరాది సురల తేజః పుంజము చేత - ఆవిర్భవించిన దేవి 'మహిషాసుర మర్దిని' అనునంశము దుర్గాసప్తశతియందిట్లు చెప్పబడినది.

తతః సమస్తదేవానాం తేజోరాశి సముద్భవామ్
తాం విలోక్యముదం ప్రాపు రమరా మహిషార్దితాః

(తరువాత సమస్త దేవతలయు తేజోరాశి సముద్భవయగు ఆ దేవిని విలోకించి మహిషునిచేత మర్దింపఁబడిన యమరులందఱును సంతోషము నొందిరి.)

మూ॥ ముఖం తవాసేచనకం ధ్యాయం ధ్యాయం నిరన్తరమ్
మృగేన్ద్రవాహే కాలేనమృడస్త్వన్ముఖతాంగతః ॥ 16

సింహవాహనవగు మాతా! ఎంత చూచినను తనివితీఅని నీ ముఖమును నిరంతరమగునట్లు ధ్యానించి ధ్యానించి నీ కాంతుఁడగు శంకరుఁడు కాలక్రమమున నీముఖము వంటి ముఖము గలవాఁడయ్యెను.

ప్రభ:- ధ్యాతకు (ధ్యానించువానికి) ధ్యేయ (ధ్యానింపదగిన వస్తువు యొక్క) తాద్రూప్యసిద్ధియే గదా ధ్యానఫలము! కావుననే శివుని ముఖమునందు అర్ధభాగము పార్వతీ ముఖమయ్యెనని ఉత్ప్రేక్ష గమ్యము.

మూ॥ కార్తికీచన్ద్రవదనా కాలిన్దీవీచిదోర్లతా
అరుణామ్భోజచరణా జయతిత్రిరుచిః శివా ॥ 17

కృత్తికానక్షత్ర యుక్తమగు పూర్ణిమనాటి చంద్రునిబోలిన ముఖముగలదియు, యమునా తరంగమును బోలిన భుజలతగలదియు, అరుణాంబుజములఁబోలిన చరణములు గలదియు నగుచు - ఇట్లు త్రిరుచియగు శివకాంత జయించుచున్నది.

**ప్రభః**:- అరుణాంబుజములన – ఎఱ్ఱతామరపూవులు. శ్వేత – కృష్ణ – రక్త ప్రభలు గలదగుట వలన శివకాంత త్రిరుచి యగుచున్నది. చంద్రునితోఁబోల్పఁబడిన ముఖము తెల్లనిది. యమునా తరంగముతో సాటి చేయబడిన భుజలత – నల్లనిది. అరుణాంబుజముతో సరిచేయఁబడిన చరణములు ఎఱ్ఱనివి.

ఇట్లు లోహిత – శుక్ల – కృష్ణ యగు శివ – త్రివర్ణయు, త్రిగుణాత్మికయునగుచు '' అజామేకాం లోహిత శుక్ల కృష్ణామ్'' అను శ్రుతి చేత ప్రతిపాదింపఁబడిన బ్రహ్మ స్వరూపిణి యగుచున్నదని చెప్పఁబడినది.

మూ॥ యత్ తేకచ భరః కాలో యద్బాహుర్లోకరక్షకః।
యుక్తం ద్వయం శివే మధ్యస్త్వసన్నాకో న నాకరాట్ ॥ 18

ఓ శివరమణీ! నీకచభరము కాలమును (కాలుఁడును) బాహు వులోక రక్షకమును (విష్ణువును) అగుట యుక్తమైయున్నది. మధ్యము (అవలగ్నము) మాత్రము నాకరాజగుచున్నాఁడు. కాని యతఁడు అసన్నాకుఁడు (స్వర్గము లేనివాఁడు) కాఁడు. (సత్+ నాకుఁడే. సన్నాకుఁడే).

**ప్రభః**:- కచభరము = కేశాతిశయము. దట్టమగు జుట్టు. కాలము = నీలవర్ణము. కాలుఁడు = యముఁడు, దుష్టలోక శిక్షకుఁడు. బాహువు = భుజము. లోకరక్షకము = లోకములను రక్షించునది. లోకరక్షకుడు = విష్ణువు. అసన్నాకుఁడు (నసన్– అసన్, సనాకః స్వర్గః, యస్యసః – అసన్నాకః) నాకములేనివాఁడు (కాఁడు) సన్నాకుఁడే – స్వర్గముగలవాఁడే.

ఇచ్చట నీయంశము చెప్పఁదగియున్నది – సర్వాంతకృత్తమగు కృతాంతుఁడు దేవి – కేశ పాశముగను, లోక రక్షకుఁడగు విష్ణువు తద్ బాహురూపముగను ఉండఁగా నాకరాజగు నింద్రుఁడు మాత్రము తదవలగ్న రూపుఁడగుట వలన శూన్య స్వరూపుఁడు కావలసియున్నది. కచభరమగు కాలుని చేత నిగ్రహమును బాహువగు విష్ణుని చేత అనుగ్రహమును చేయఁబడుట వలన అవలగ్నమగు నాకరాజు చేత



కావింపఁదగిన కార్యము శూన్యమేయగును. కాని స్వర్గ రాజ్య భోగముమాత్రము మిగిలియున్నది. కావుననే, అతఁడు అసాన్నాకుఁడు కాఁడని నాకముగలవాఁడేయని చెప్పఁబడినది.

ఈ యంశము – ఏతత్ కవిచేత మీఁది భాగమున 'నాకోఽవలగ్నమీశ్వరి' అను శ్లోకమున గానము చేయఁబడెను. దానియర్థమిట్లున్నది.

స్వర్లోక- భూలోక పాతాళలోకములు – పరమేశ్వరి కుక్షియందున్నవి. అయినను తత్ కుక్షియందేకాక బహిశ్శరీరమునందుఁగూడ నవికలవు. అదెట్లనిన, నాకము – నడుము, భూమి – కటిప్రదేశము, భోగిలోకము నాభి – ఇందు నాకమే నడుముగాఁ జెప్పబడినది. నడుము సూక్ష్మమని స్ఫురింపఁజేయుటకు, ఆకాశమధ్య అనియు, మధ్య శూన్యయనియు సుందరియగు కాంతను వర్ణించుట కవి సమయము గదా. కావున నిచ్చఁటగూడ లేనిదివలె నతి సూక్ష్మమైయున్న నడుమే నాకమని చెప్పఁబడియెనని యెఱుఁగునది. నడుము శూన్యమగు నెడల, దానియం దారోపితమయిన నాకము గూడ శూన్యమను శంకకలుగును. గావున, నాకరాజు – అసన్నాకుఁడు కాడని, ఆశంక – నిరసింపఁబడినది. నడుములేకున్నను – నాకరాజ్యము ననుభవించుటకు నాకరాజు లేనివాఁడు కాఁడు.

మూ॥ స్వదేహాదేవ యా దేవీ ప్రదీపాదివ దీపికా।
ఆవిర్భ భూవ దేవానాం స్తువతాం హర్తుమాపదః॥ 19

ఏ దేవత (కౌశికి) స్తుతించుచున్న దేవతల యాపదలను తొలఁగించుటకు ప్రదీపము నుండి దీపిక వలె స్వదేహము నుండి యావిర్భవించెనో, (కౌశికియను నామమున ప్రసిద్ధురాలగు ఆ యుమాదేవికి నమస్కరించుచున్నాను).

**ప్రభః**:- మీఁది బ్రాకెట్టునందుఁ దెలిపిన యర్థము – ఇరువది మూఁడవ శ్లోకమునఁగలదు. కావున మీది శ్లోకార్థమునకును, **20, 21, 22** శ్లోకములకును

దానితో నన్వయము గలదని యెఱుఁగునది. ఒక్క తెయే యగుదేవియొక్క శరీరము నుండి తద్ దేవీమూర్తులగు శక్తులనేకములు, తద్విభూతి నుండి సంభవించి, ఆమెయందే లీనములయ్యెనని తృతీయ చరితమున నిట్లు స్పష్టీకరింపఁబడియెను. ''తరువాత అతి భీషణయు, శతని నాదినియునగు చండికాశక్తి దేవీ శరీరమునుండి బయలువెడలెను.''

ఈ యంశమునే దేవి శుంభునితో నిట్లు పలికెను. '' ఈ ప్రపంచమున నేనొక్కతేనే యున్నాను. నాకంటె వేఱగు రెండవ శక్తి లేదు. నేను నావిభూతిచే నిచట ననేక రూపములతో నుండి యిప్పుడు వాని నుపసంహరించి మరల ఒక్క తెనే యయి యున్నాను. ఇప్పుడు నీవు స్థిరముగా నుండుము.''

మూ॥ ధైర్య, చాతుర్య, గాంభీర్య, వీర్య సౌన్దర్యశాలినీమ్
రత్నం నితమ్బినీజాతా మేనరేయాం సురాసురాః ॥ 20

ధైర్యము చేతను, చాతుర్యముచేతను, గాంభీర్యము చేతను, వీర్యముచేతను, సౌందర్యము చేతను వెలయుచున్న యే దేవిని స్త్రీ జాతియందలి రత్నమని సురాసురులు తలచిరో, (కౌశికీనామమున ప్రసిద్ధురాలగు నాయుమాదేవికి నమస్కారము).

ప్రభ:- రత్నమన శ్రేష్ఠురాలని భావము.

మూ॥ యదీయహుఙ్కృత్యనలే ధూమ్రాక్షో ఽభవదాహుతిః।
సమాప్తిం భీషణం యావన్నైవావాపవికత్థనమ్ ॥ 21

భయావహమగు నాత్మ పరాక్రమ కీర్తనము సమాప్తము కాకుండఁగనే ధూమ్రాక్షుఁడను శుంభాసురసేనాని - యే దేవి యొక్క హుంకారాగ్ని యందు ఆహుతియయ్యెనో (కౌశికీనామమున ప్రసిద్ధురాలగు నాయుమాదేవికి నమస్కరించుచున్నాను).



ప్రభ:- దేవి యొక్క క్రోధ ప్రకాశకమగు హుం కారాగ్నియందు, తన యాత్మ శ్లాఘనము ముగియకుండు లోపలనే ధూమ్రాక్షుఁడు హోమము చేయఁబడియెనని భావము. ఆ రాక్షసుని వికత్థనవాగ్జాలమునకు దేవీహుంకారము ప్రత్యుత్తరమయ్యెను. ''లోకాతిశయ సమ్పత్తి వర్ణనోదాత్తముచ్యతే'' అను తల్లక్షణము ననుసరించి ఇచట లోకాతిశయ సంపత్తి వర్ణనమువలన నుదాత్తాలంకారమగును.

మూ॥ యస్యాఃశూలే జగామాస్తం యశః శుమ్భ - నిశుమ్భయోః
నమామి విమలశ్లోకాం కౌశికీం నామ తాముమామ్ ॥ 22

ఏ దేవి యొక్క శూలాయుధము నందు శుంభ - నిశుంభులకీర్తి యస్తమించెనో కౌశికీనామమున ప్రసిద్ధురాలగు ఆ యుమాదేవికి నమస్కరించుచున్నాను.

ప్రభ:- శుంభ నిశుంభులు సహోదరులు. శుంభ - నిశుంభహన్త్రియగు మూర్తి కౌశికి అనునది ప్రసిద్ధము. ''కౌశికీనామ సా దుర్గా హన్త్రీ శుమ్భ - నిశుమ్భయోః'' అని వెనుక చెప్పఁబడినదిగదా!

మూ॥ యశోదాగర్భజననాద్ యశోదాం గోకులస్యతామ్।
వన్దేభగవతీం నన్దాం విన్ధ్యాచల నివాసినీమ్ ॥ 23

నందుఁడను గొల్లవానికి భార్యయగు యశోద యొక్క గర్భమున జనించుట వలన గోకులమునకు యశోదయు (కీర్తినొసగినదియు) వింధ్య పర్వతనివాసినియు భగవతియునగు నందాదేవికి వందన మొనర్చుచున్నాను.

ప్రభ:- గోకులము = శ్రీకృష్ణుని బాల క్రీడలకు వాస స్థానమగు గొల్లపల్లె.

''కంసుని వలని భయము వలన దేవకీపుత్రుఁడగు శిశువు (కృష్ణుడు) గోకులమునకును, నందుని శిశువగు నంద, దేవకీ గృహమునకును తీసికొని రాఁబడియెను. ఆమహామాయా స్వరూపిణియగు ఈనందాదేవి కంసుని వెఱపించి యదృశ్యయయ్యెను'' అని భాగవతమునఁ జెప్పఁబడియున్నది. ఆయానంద వింధ్యాచలాధిష్ఠాత్రియఁగు భగవతియఁని గానవము చేయఁబడినది. దేవీ మహాత్మ్యమునందలిమూర్తి రహస్యమున నిట్లున్నది.

''నన్దా భగవతీ నామ యాభవిష్యతినన్దజా
సాస్తుతా పూజితా ధ్యాతా వశీకుర్యాజ్జగత్ త్రయమ్''

నందునకుదయించి నంద అనునామమున ప్రసిద్ధురాలు గానున్న భగవతిని స్తుతించిన వారికిని, పూజించిన వారికిని, ధ్యానించిన వారికిని గూడ - ఈజగత్త్రయము వశీకరింపఁబడును.

మూ॥ చాముండా శివదూత్యౌ యత్యవే దారుణ విక్రమే॥
భిక్షయా మాసతుః మూర్తీః । కీర్తిభిస్సహ రక్షసామ్ ॥ 24

చాముండ, శివదూతి అను దేవతలు పరాంబిక అయిన ఉమయొక్క అంశములే. (విభూతులు) వారు రణరంగమున తమ పరాక్రమముతో రాక్షసుల మూర్తి, కీర్తులను (దేహాలను, కీర్తులను కూడా) ఒక్కసారిగా మ్రింగివేసిరి. (అనగా చాముండ, శివదూతియు రాక్షసులను క్షణంలో తుదముట్టించిరి).

**ప్రభ:**- యత్యవే = ఉమాదేవి యొక్క అంశలైన, దారుణ విక్రమే = గొప్ప పరాక్రమము గల, చాముండా శివదూత్యౌ = చాముండ, శివదూతి అనువారు, రక్షసామ్ = రాక్షసుల యొక్క, మూర్తీః = శరీరములను, కీర్తిభిః సహ = వారి కీర్తులతో కలిసి, భక్షయా మా సతుః = తిని వేసిరి.



మూ॥ అమ్బికా ముపతిష్ఠన్తా మేతాశ్చణ్డీమనుష్టుభః।
ప్రసన్నాః సాధ్వలఙ్కారాః సిద్ధపద్మేక్షణా ఇవ ॥ 25

ఈ యనుష్టుప్పులు = అనుష్టుప్ ఛందోబద్ధములగు ఈ స్తుతులు ప్రసన్నలు - సాధ్వలంకారలు - అగుచు, సిద్ధపద్మాక్షులవలె, అంబికయగు చండిక నుపాసించి సేవించునుగాక!

**ప్రభ:**- దేవయోని విశేషులు - సిద్ధులు, సిద్ధపద్మాక్షులు = సిద్ధ సుందరులు అనుష్టుప్పుల పక్షమున 'ప్రసన్నలు' అనఁగా శబ్దార్థ ప్రసాదగుణ విశిష్టలు (అక్లిష్టలు) అనియు సిద్ధసుందరుల పక్షమున నిర్మల స్వభావలనియు నట్లే సాధ్వలంకారలనఁగా సమీచీనములగు ఉపమాద్యలంకారములు గలవనియు, శోభనములగు భూషణములు గలవారనియు నర్థము నెఱుంగునది.

అనుష్టుప్పులకును - సిద్ధసుందరులకును ఇట్లు శేషోత్థాపితమగు సాధర్మ్యము వలన నిచట ఉపమ - అలంకారమగుచున్నది.

ఆంధ్రభాషయందుఁగూడ ''అనుష్టుప్'' అను శబ్దమునకు స్త్రీ త్వమును వివక్షించుట వలన ప్రసన్నములు సాధ్వలంకారములు అనుటకుమారుగ - ప్రసన్నలు సాధ్వలంకారలు అని ప్రయోగింపఁబడియెనని పాఠకులు గ్రహింపఁగోరెదను.

(పం. ల. నా. శాస్త్రి)

మీఁది స్తబకమున - సప్తశతీప్రోక్తమగు దేవీ మహిమ కీర్తింపఁబడినది. దేవీ మహాత్మ్యమున ప్రతిపాదింపఁబడిన యాదేవి చండీనామమున ప్రసిద్ధయగుట వలన - ఆమె యిచట 'చండికగా' ఉపసేవింపఁబడినదని గ్రహించునది.

ఇతి శ్రీ మహర్షి రమణభగవత్ పాదాన్తేవాసినో వాసిష్ఠస్య
నారసింహసూనోః గణపతిమునేః కృతౌ ఉమాసహస్రే
అష్టమః స్తబకః సమాప్తః।
సమాప్తంచ ద్వితీయమ్ శతకమ్

ఇది శ్రీ మహర్షి - రమణ భగవత్పాదశిష్యుడు,
శఠమర్షణసగోత్రుడు,
శ్రీ మత్పంతుల పేరయశాస్త్రిపౌత్రుడు, వెంకటరామ
బుధేంద్రపుత్రుడు అగు లక్ష్మీనారాయణ శాస్త్రిచే
నాంధ్రీకరింపఁబడిన యుమాసహస్రమను స్తోత్ర
కావ్యమున ద్వితీయ శతకము
శ్రీ శ్రీ శ్రీ

****



ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# ఉమాసహస్రము

## (తృతీయ శతకమున – ప్రథమ స్తబకము)

## నవమ స్తబకము

**అవ:-** ఈ స్తబకమున – మహా ప్రభావమును, సర్వాతిశాయి రామణీయకమును అగు ఉమాదేవి మందహాసము – భంగీభేదమున స్తుతింపఁబడుచున్నది.

మూ॥ శారదవలక్షపక్షక్షణదా వైమల్యశిక్షకో௨స్మాకమ్।
జాగర్తు రక్షణాయ స్థాను పురంధ్రీముఖ వికాసః ॥ 1

శరత్సమయమందలి శుక్ల పక్షరాత్రులకు వైమల్య శిక్షకమగు (నిర్మలతను గఱపునదియగు) స్థాణుపురంధ్రీ ముఖ వికాసము – మమ్ము రక్షించుటకు జాగరూకమగుఁగాత!

ప్రభ:- వైమల్య శిక్షకమన, నైర్మల్యమును బోధించునది (అధ్యాపకము) అని యర్థము.

జ్యోత్స్నా వైమల్యము కంటెనుగూడ ముఖవికాస ప్రకాశ మధికమని భావము. స్థాను పురంధ్రీముఖ వికాసమన, శివసుందరీ మందహాసమని యర్థము.

ఇందలి శిక్షక శబ్దము సాదృశ్యసూచకము. కావున వెన్నెలయొక్క వైమల్యమునకును, ఉమా ముఖ వికాసమునకును గల ప్రకాశకతా సాధర్మ్యము వలన నిది యుపమాలంకారమగుచున్నది. దండ్యాచార్యుఁడు ప్రతి పక్షాదిశబ్దములు